క్లుప్తంగా

పినపాడులో డెంగీపై అవగాహన ర్యాలీ



తెనాలిఅర్బన్: డెంగీపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పినపాడులోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి గరికపాటి లిఖిత కోరారు. మలేరియా తెనాలి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పినపాడులో డెంగీ నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా తెనాలి సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పాల్గొన్నారు.

కొల్లిపరలో..

కొల్లిపర: డెంగీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ వేముల ప్రియాంక అన్నారు. మంగళవారం మండలంలోని మున్నంగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే సందర్భంగా ఏఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సమాజ ఆరోగ్య అధికారిణి డి.స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి వి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం అన్నదానం చేశారు. ప్రతి నెల పౌర్ణమి రోజున భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామని అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకులు ఆర్.వి.కిరణ్‌కుమార్, సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధతో పాటు వుప్పల వరదరాజులు, కౌన్సిలర్ త్రిమూర్తి, సేవా సమితి సభ్యులు సురేష్, గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, బచ్చు లీలా ప్రసాదరావు, చంద్రశేఖర్, రాజశేఖర్, సంకీర్తనా బృందం సభ్యులు, సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ శిల్పి కాటూరికి గురు సత్కారం



తెనాలి: గురుపౌర్ణమి సందర్భంగా విజయవాడలోని సంస్కార భారతి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన గురుపూజ మహోత్సవంలో తెనాలికి చెందిన ప్రముఖ శిల్పకారుడు కాటూరి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. శిల్పకళలో వివిధ ప్రక్రియల్లో రకరకాల శిల్పాలను తయారు చేస్తూ ఖండాంతర ఖ్యాతిని సాధించినందుకు సత్కరించినట్లు తెలిపారు. సంస్కార భారతి నిర్వాహకులు, విజయవాడ ఆర్ట్స్ సొసైటీ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ల్యాబ్ అసోసియేషన్ సేవలు వెలకట్టలేనివి

డీఎంహెచ్ఓ శ్రావణబాబు



మంగళగిరి: వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతి గృహాల అభ్యున్నతికి ల్యాబ్ అసోసియేషన్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ శ్రావణబాబు అన్నారు. గుంటూరు జిల్లా ల్యాబ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ నేతృత్వంలో మంగళగిరి మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవులూరు ఏసీఏ క్రికెట్ స్టేడియం సమీపంలోని వెనుకబడిన తరగతుల విద్యార్థుల వసతి గృహానికి కల్పించిన మౌలిక వసతులను మంగళవారం డీఎంహెచ్ఓ దంపతులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే మనం మాత్రమే అభివృద్ధి చెందడం కాదని, సమాజంలో అన్ని వర్గాల వారిని అభివృద్ధిలోకి నడిపిన నాడే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ శర్మ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు ఆనం సంజీవరెడ్డి, సెక్రటరీ శ్రీహరి, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థికి అంతర్జాతీయ అవార్డు

తాడేపల్లిరూరల్: యూఎస్ఏకి చెందిన ఎన్విరాన్‌మెంట్ మ్యూటాజెనిసిస్ అండ్ జెనోమిక్స్ సొసైటీ అవార్డుకు వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో బయో టెక్నాలజీ న్యూరో సైన్స్‌లో పరిశోధనా విద్యార్థిని లక్ష్మీసౌమ్య ఎంపికైందని విశ్వవిద్యాలయ ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చికాగోలో సెప్టెంబర్ 9, 13 తేదీల్లో జరిగే కార్యక్రమంలో లక్ష్మీసౌమ్య న్యూరో సైన్స్ పైన చేసిన పరిశోధనా పత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



చివలూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్

చివలూరు(కొల్లిపర): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. మండలంలోని చివలూరు, అత్తోట గ్రామాలలోని గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని సురక్ష కార్యక్రమంలో భాగంగా చివలూరు గ్రామ సచివాలయంలో ఆధార్ లింక్, కులధ్రువీకరణ పత్రం, ఇసీకం, రేషన్ కార్డులో మార్పులు వంటి సేవలు ఉపయోగించుకున్న 191 మందికి, అత్తోట గ్రామ సచివాలయంలో 145 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలతో పథకాలు అందేవని చెప్పారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏడాది పాటు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాగా పని చేశారన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలోను ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు 99 శాతం మందికి లబ్ధిచేకూరిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు సంక్షేమానికి దూరంగా ఉండకూడనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సంజీవరెడ్డి, సర్పంచులు బొంతు వేణుగోపాలరెడ్డి, దేశబోయిన నాగపునేశ్వరరావు, ఎంపీటీసీలు కారుమంచి పృద్వీకుమార్, బొల్లిముంత పోతురాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓవి.చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, ఈవోపీఆర్డీ శంకరరావు పాల్గొన్నారు.



నందివెలుగులో సర్టిఫికెట్ అందజేస్తున్న ఏడీ వనజ, సర్పంచి పవన్‌కుమార్

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, దీని ద్వారా 11 రకాల సర్టిఫికెట్‌లను పొందవచ్చని మండల ప్రత్యేక అధికారి, హ్యాండ్ లూమ్స్ ఏడీ వనజ తెలిపారు. రూరల్ మండలం నందివెలుగులోని కల్యాణ మండపంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వివిధ రకాల సర్టిఫికెట్‌లను దరఖాస్తు చేసుకోగా అదే రోజు లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. స్పెషలాఫీసర్ వనజ, సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీడీఓ విజయాలక్ష్మణ్, ఎంపీటీసీ తిన్నలూరి విజయలక్ష్మి సుమారు 921 మందికి కుల, ఆదాయం, రేషన్, కౌలు రైతు కార్డులను అందజేశారు. ప్రత్యేకాధికారి వనజ మాట్లాడుతూ రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే రోజు సర్టిఫికెట్‌లను పొందవచ్చని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, ఏఈలు ఎం.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారి విజయమోహన్, పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, సీసీ సుబ్బారావు, వీఆర్వోలు కృష్ణమూర్తి, లక్ష్మి పాల్గొన్నారు.

జాషువానగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- నందివెలుగులో గడప గడపకు మన ప్రభుత్వం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: నందివెలుగు జాషువానగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. అధికారులు, వలంటీర్లు, సచివాలయ, పంచాయతీ సిబ్బందితో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని ప్రజలు విన్నవించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రూ.ఎనిమిది కోట్లతో గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. ముస్లిం ఏరియాలో షాదీఖానా నిర్మిస్తామన్నారు. పేదవాని జీవన ప్రమాణాలు పెరగాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశ్వాసంతో ప్రజలు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు షేక్ సిలార్ జానీ, పార్టీ నాయకులు కసుకుర్తి దానియేలు, వట్టిప్రోలు సురేష్‌బాబు, జయంపి అరుణరావు, కసుకుర్తి జడ్సన్, నాగేశ్వరరావు, రమేష్, జోసఫ్, వట్టిప్రోలు అశోక్, విజయ్‌కుమార్ కొండమూడి ముత్తయ్య, వేముల మహేష్, బొంతు నరేంద్రరెడ్డి, మంగా శివనాగేశ్వరరావు, బెజ్జం బాజి, తన్నీరు వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, వీఆర్వోలు కృష్ణమూర్తి, లక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయ దిగ్గజం రోశయ్య ఆదర్శప్రాయుడు

రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు



రోశయ్య కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేవీపీ రామచంద్రరావు

తెనాలి: రాజకీయ దిగ్గజం కొణిజేటి రోశయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు విలువైనవని రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి రోజైన మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ స్థానిక నాయకులతో కలసి పూలమాలలు వేశారు. అనంతరం బోసురోడ్డులోని రోశయ్య కాంస్య విగ్రహానికి పార్టీ నేతలు, ఆర్యవైశ్య నేతలతో కలసి పుష్పాంజలి ఘటించారు.

రోశయ్య సేవలను స్మరించుకున్నారు. అపారమైన మేధస్సు, కష్టించే మనస్తత్వం, ఆర్థిక క్రమశిక్షణ, పట్టుదల కలిగిన రోశయ్య తన వ్యక్తిత్వంతో రాజకీయాల్లో రాణించారని గుర్తుచేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శిఖరరావు, వై.శివరామకృష్ణప్రసాద్, కె.బుల్లియ్య, పి.శివకుమార్, ఎస్‌కే మాబు, పి.స్టీవెన్‌బాబు, టి.శివన్నారాయణ; బీమా రమేష్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సాధు ప్రతాప్, కారుమంచి రమాదేవి, మద్దాళి శేషాచలం, చుండూరు సాయి ప్రభృతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో..

తెనాలిఅర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య చేసిన సేవలు మరువలేనివని ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోగినేని విజయకృష్ణ, సీనియర్ అధ్యాపకులు ఎం. దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. రోశయ్య జయంతిని కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు కేవీ రవికుమార్, టీజీ కళావతి, షేక్ రఫీ, ఆర్‌వీ సునీత, ఎ.బాలగోపాల్, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



తెనాలిఅర్బన్: మన్యం వాసుల కష్టాలను తీర్చేందుకు ఎన్నో పోరాటాలు చేసిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్, కుంభ రవితేజ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోలాశేఖర్, శ్రీను పాల్గొన్నారు.

మహిళా కమిషన్ సదస్సుకు డాక్టర్ శారదకు ఆహ్వానం



తెనాలి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం నిర్వహించనున్న ప్రత్యేక సదస్సుకు పట్టణానికి చెందిన శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారదకు ఆహ్వానం లభించింది. 'సోషల్ మీడియా వేదికగా మహిళలపై దూషణలు- సలహాలు, సిఫార్సులు' అనే అంశంపై మహిళా కమిషన్ విజయవాడలోని హోటల్ ఐలాపురంలో బుధవారం సదస్సు నిర్వహిస్తోంది. తెనాలిలో సొంతంగా వైద్యశాల నిర్వహిస్తూ, సొసైటీని స్థాపించి ఎన్నో సామాజిక, ఉచిత వైద్యసేవలను అందిస్తున్న డాక్టర్ శారద పలు శాస్త్ర, సామాజిక సేవాసంస్థల్లో పనిచేస్తున్నారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల ఫిర్యాదుల కమిటీలోనూ సభ్యులుగా ఉన్నారు. స్థానిక మహిళా కాలేజీలోని పోక్సో చట్టం కమిటీలోనూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

తెనాలిరూరల్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యంపై కేసులు మంగళవారం నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఆకురాతి శ్రీనివాసరావు ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మారీస్‌పేట సీఎం కాలనీకి చెందిన 31 ఏళ్ల రమడి ఈశ్వరరావు 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయాడు. రెండు కేసులనూ నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్ కుమార్ తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: బైక్ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మోటార్ బైక్‌ల చోరీ కేసుల్లో అరెస్టు చేసిన నిందితుల వివరాలను డీఎస్పీ బి.జనార్దనరావు వెల్లడించారు. పట్టణ నాజరుపేటకు చెందిన షేక్ కరిముల్లా, ఐతానగర్ ఈటీ కాలనీకి చెందిన రహుత్ సాల్మన్ గతంలో పలు మోటార్ బైక్ దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు. గత వారం వ్యవధిలో టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద రెండు బైక్‌లు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుపై కేసులు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి విచారించగా చెరుకుపల్లి, విశాఖపట్నం, పొదిలి ప్రాంతాల్లో మరో మూడు బైక్‌లు చోరీ చేసినట్లు నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి తెనాలిలో చోరీ చేసిన రెండు బైక్‌లతో పాటు ఇతర ప్రాంతాల్లో చోరీ చేసిన మిగిలిన మూడు బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు బైక్‌ల విలువ రూ. 2.50 లక్షలు ఉంటుందని డీఎస్పీ జనార్దనరావు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్ఐలు టి. రమేష్ బాబు, పి.నాగేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

వెద పెట్టిన వరి చేలకు నష్టం

తెనాలి: భారీ వర్షాలకు ఐదు వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేసిన వరి విత్తనం దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లిందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి వెల్లడించారు. మంగళవారం రైతు ప్రతినిధి బృందం రైతులతో కలిసి అయితానగర్, తేలప్రోలు, కంచర్లపాలెం, నేలపాడు గ్రామాలను సందర్శించారు. ఇరిగేషన్, డ్రెయినేజి, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము నష్టపోయామని రైతులు మేకల చిట్టిబాబు, వేజండ్ల రోశయ్య, మహబూబ్‌ఖాన్ ఆవేదన వ్యక్తంచేశారు. డ్రెయినేజీ పూడుకుపోయిన గుర్రపుడెక్క, తూటాకను సకాలంలో తొలగించకపోవటంతో వరదనీరు పంటపొలాలను ముంచిదని తెలిపారు. ఫలితంగా దాదాపు 5 వేల ఎకరాల్లో చల్లిన వరి విత్తనం కుళ్లిపోతోందని చెప్పారు. ఇప్పటికే ఎకరాకు రూ.5–7 వేలు ఖర్చు చేసినట్టు వివరించారు. ప్రభుత్వం రైతులకు తగిన నష్టపరిహారం, ఉచితంగా విత్తనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు, ఈదర మురళి, హారికా ప్రసాద్, పాలేటి వెంకట్రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



శోభాదేవిని సత్కరిస్తున్న విద్యా కమిటీ చైర్మన్ అనిల్, ఉపాధ్యాయులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న శోభాదేవి, పలువురు ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. హైస్కూల్ హెచ్ఎం మాచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో బదిలీపై దుగ్గిరాల వెళ్లిన హెచ్ఎం శోభాదేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సుభాషిణి, లక్ష్మయ్య, జాన్ అహ్మద్, నాగయ్యలను సత్కరించారు. పాఠశాలకు, విద్యార్థుల అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. పాఠశాలలో పనిచేసిన రోజులు, అనుభవాలను వారు గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, మత్తే అన్నారావు, మారుతీ కిరణ్, బాలు నాయక్, తోట శ్రీనివాసరావు, బుల్లా శోభ, గరికపాటి పద్మావతి, కొలకలూరి దేవికా రాణి, సుజాత, అనూరాధ, సుభాషిణి పాల్గొన్నారు.

నిజమైన ప్రజల వద్దకు పాలన అంటే ఇదే..



అంగలకుదురులో ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అగ్రవర్ణాలతో సహా పేదలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ, గడప గడపకు వెళ్లి ఇస్తున్న సంక్షేమాన్ని వివరించి, ఇతర సమస్యలుంటే ఆరా తీస్తుండటమే కాకుండా, మరింత సత్వర సాయానికి 11 రకాల సేవలతో కూడిన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానిదే నిజమైన ప్రజల వద్దకు పాలనగా తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ మండలం అంగలకుదురులో ఒకటో సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం అక్కడి కల్యాణమండపంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 11 రకాల సేవలను అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ప్రోగ్రాంను అమల్లోకి తీసుకొచ్చినట్టు చెప్పారు.

జగనన్న సురక్షపై కార్యక్రమంపై అవగాహన లేని ప్రతిపక్ష నాయకులు, ఉమ్మడి రాష్ట్రానికి స్పీకర్‌గా చేసిన వ్యక్తి కూడా జగనన్న సురక్ష పథకం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమ్మ వర్గీయులకూ సంక్షేమ లబ్ధి....

కులమతాలు, పార్టీలు, ప్రాంతాలు చూడకుండా పేదలందరికీ సంక్షేమం అందిస్తున్నందునే అంగలకుదురు గ్రామంలో అనేకమంది టీడీపీ వారికి పింఛన్లు, చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన పథకాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. సభానంతరం ఒకటో సచివాలయ పరిధిలోని 457 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ హెనాప్రియ, డివిజనల్ అభివృద్ధి అధికారి కె.పద్మావతి, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, సొసైటీ చైర్మన్ బండి హైమారావు, ఫరీద్, కావూరి కిశోర్, కడియాల సురేష్, బాదుల్లా, కొండముది కిరణ్, శ్రీకాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి పట్టణంలో...

తెనాలిలో 21, 22 వార్డులకు జగనన్న సురక్ష శిబిరాన్ని పట్టణంలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులమీదుగా రెండు సచివాలయాల పరిధిలో 330 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు మాట్లాడారు. కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, నాయకులు తాడిబోయిన రమేష్, ఎ.సిరికృష్ణ, బండ్లమూడి భాస్కరరావు పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలకు బాయిల్స్ ఆపరేటర్లు వితరణ



దాత సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న డీసీహెచ్ఎస్ హనుమంతరావు, డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆరోగ్య వేదిక, కర్లపాలెం పద్మావతి, నరసింహామూర్తి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి జిల్లా వైద్యశాలలోని ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన రూ.80వేలు విలువ చేసే బాయిల్స్ ఆపరేటర్లను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు సాయిప్రసాద్ మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలోని అనేక మంది పేదలకు జిల్లా వైద్యశాల విశేష సేవలు అందిస్తుందని కొనియాడారు. ఆపరేషన్ థియేటర్‌లో మత్తు ఇచ్చేందుకు ఉపయోగించే బాయిల్స్ ఆపరేటర్లను అందజేయడం జరిగిందన్నారు. ఆయనను ఏపీవీవీపీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యావేదిక సభ్యులు విజయలక్ష్మి, కిరణ్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి



రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు



రామలింగేశ్వరపేటలో..

తెనాలి: దివంగత వంగవీటి మోహనరంగా రాజకీయ పార్టీల కతీతంగా అందరి హృదయాల్లో చిరస్మరణీయంగా ఉన్నారని పలువురు వక్తలు నివాళులర్పించారు. వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక రైల్వేస్టేషను రోడ్డులోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మనిషిగా దూరమైనా కొన్ని తరాలకు కావాల్సిన శక్తిని ఇచ్చారని చెప్పారు. గ్యాలం వేణు, వల్లెం మురళి, చల్లా శివ, నాగిశెట్టి సాయిగోపి, చక్రాయపాలెం ఎంపీటీసీ అమ్మిశెట్టి హరికృష్ణ, ధర్మారావు, చల్లా జిత్తుబాబు తదితరులు పాల్గొన్నారు.


రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో..

తెనాలి: మాజీ ఎమ్మెల్యే, పేదప్రజల ఆశాజ్యోతి, బడుగు బలహీనవర్గాల నేత వంగవీటి మోహనరంగా జయంతిని మంగళవారం స్థానిక రామలింగేశ్వరపేటలోని రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మట్టుపల్లి గోపాలకృష్ణ మిత్రబృందం అక్కడి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ కౌన్సిలర్ హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, పాలడుగు లక్ష్మీనారాయణ, అన్వేష్, కొండూరు శివయ్య, పచ్చు శ్రీనివాస్, గురుశెట్టి శ్రీనివాస్, దొడ్డంపూడి నాగరాజు, బండారు రవికాంత్, బండారు రవికాంత్, శరత్, ఎం.కోటేశ్వరరావు, సుందరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నందులపేటలో..

తెనాలి: పట్టణ నందులపేటలో మంగళవారం దివంగత నేత వంగవీటి మోహనరంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. వన్నెం మురళి అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, పీఏసీ మాజీ చైర్మన్ దాది సూరయ్య ప్రభృతులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కేక్ కట్ చేశారు. బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి మోహనరంగా చిరస్మరణీయులని చెప్పారు. కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు గ్యాలం వేణు, జనసేన నేత హరికృష్ణ, శిల్పుల శ్రీను, త్రిపురాంతకుడు, కాలేషా, షేక్ హర్ష అహ్మద్, రాంబాబు, చెన్నయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

తెనాలిలో ఎడతెరిపి లేని వర్షం



వర్షపు నీటితో నిండిన రోడ్లు

తెనాలిఅర్బన్: తెనాలిలో సోమవారం సాయంత్రం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. గాలులతో కూడిన వర్షం మంగళవారం మధ్యాహ్నం వరకు పడుతునే ఉంది. దీంతో పట్టణంలోని దాదాపు అన్ని రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. మంగళవారం ఉదయం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగులు తమ కార్యాలయాలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఎండ తీవ్రతతో ఇప్పటి వరకు గడిపిన ప్రజలకు వర్షం కొంత ఊరటనిచ్చింది.

బాప్తిజం ఘాట్ నిర్మాణానికి ఆటంకం కలిగిస్తే ఉపేక్షించం

మంగళగిరి: నగరంలో క్రైస్తవుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన బాప్తిజం ఘాట్ నిర్మాణానికి ఆటంకం కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని పాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.తిమోతి అన్నారు. తెనాలి రోడ్డులోని గుంటూరు చానల్ వెంబడి ప్రభుత్వ స్థలంలో నిర్మితమవుతున్న బాప్తిజం ఘాట్ నిర్మాణాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు సోమవారం అడ్డుకోగా వారిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం పాస్టర్స్ ఫెలోషిప్ మంగళగిరి నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నగరంలోని ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాస్టర్ తిమోతి మాట్లాడుతూ నీతిగా బతకడానికి పుణ్యస్నానం ఆచరించడమే బాప్తిజం అని అన్నారు. దీనికి మత మార్పిడి అని పేరు పెట్టి క్రైస్తవ సమాజాన్ని అవమానించడం తగదన్నారు. నదులు, కాలువల వద్ద బాప్తిజం స్వీకరణ వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు.